గృహ నిర్మాణాలకు అడ్వాన్స్‌లు : పీవో

భామిని: మండలంలోని కొరమ, ఘనసరలో నిర్మిస్తున్న జగనన్న కాలనీ లే అవుట్లను ఐటీడీఏ పీవో కె.కల్పనాకుమారి బుధవారం పరిశీలించారు. గృహ నిర్మాణాల పూర్తికి తక్షణమే అడ్వాన్స్‌లు కింద పెంచిన మొత్తాలు చెల్లించాలని హౌసింగ్ అధికారులకు పీఓ సూచించారు. నిర్మాణాల పూర్తికి అర్హులను గుర్తించి అడ్వాన్స్‌లు ఇచ్చేందుకు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు గుర్తించి సిఫారసు చేయాలన్నారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ నాయకుడు అగత ముడి రఘు, హౌసింగ్ సిబ్బంది ఉన్నారు.

మినీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు

- జూలై రెండో వారంలో తోటపల్లి నీరు విడుదల
- మండల సమావేశంలో ఎమ్మెల్సీ విక్రాంత్

వీరఘట్టం: మండలంలో విద్యుత్ సంక్షోభాన్ని అధిగమించేందుకు మినీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు అధ్యక్షతన బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో మినీ విద్యుత్ సబ్‌స్టేషన్ అవసరం ఉందని, ప్రతిపాదనలు చేసి మండల పరిషత్ కార్యాలయానికి పంపాలని ఏఈ బాలాజీకు ఎమ్మెల్సీ సూచించారు. జల వనరుల శాఖ అధికారులు మాట్లాడుతూ



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్

తోటపల్లి ప్రాజెక్టు పరిధిలో ఉన్న పాత ఆయకట్టుకు జూలై 2వ వారంలో సాగునీరు విడుదల చేస్తామన్నారు. రూ.5.50 కోట్లతో జరుగుతున్న వీరఘట్టం ప్రధాన రహదారి పనులను జూలై నెలాఖరుకు పూర్తి చేస్తామని ఆర్అండ్‌బీ జేఈ జగన్‌మోహన్‌రాజు తెలిపారు. మండలంలో 32 గ్రామాల్లో భూముల రీసర్వే చేస్తున్నామని ఈ ఏడాది డిసెంబరు 31నాటికి పూర్తి చేస్తామని తహసీల్దార్ చందక సత్యనారాయణ తెలిపారు. జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, వైస్ ఎంపీపీ విశ్వాసరాయి భార్గవ్, పీఏసీఎస్ అధ్యక్షుడు కర్రి గోవిందరావు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కర్రి లీలాప్రసాదరావు, ఎంపీడీఓ జయంత్‌ప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలి

గరుగుబిల్లి: కురుపాంలో ఈ నెల 28న జరగనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ వై.సత్యంనాయుడు అన్నారు. మండల కేంద్రంలోని వైకేపీ కార్యాలయంలో బుధవారం మండల గ్రామైక్య సంఘాలతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కార్యక్రమం విజయవంతం చేసేందుకు ప్రతి గ్రామం నుంచి అధిక సంఖ్యలో మహిళా సంఘాల సభ్యులు హాజరు కావాల్సి ఉందని పేర్కొన్నారు. సమావేశంలో వైకేపీ ఏపీఎం పి.అప్పలనాయుడు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గంట లక్ష్మి, సీసీలు సిహెచ్.తిరుపతిరావు, వి.లక్ష్మణరావు, కె.కృష్ణ, బి.రామినాయుడు, ఇహెచ్.ప్రసాద్ కంప్యూటర్ ఆపరేటర్ కె.రమేష్‌తో పాటు గ్రామైక్య సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.

విలువ ఆధారిత ఉత్పత్తులపై శిక్షణ

గుమ్మలక్ష్మీపురం/కురుపాం: కురుపాం మండలంలోని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం (ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం)లో ఒడిశాకు (సీవైఎస్‌డీ లక్ష్మీపుర్) చెందిన 25 మంది గిరిజన రైతులకు (ఒడిశా మిల్లెట్ మిషన్ చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తులపై బుధవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే ప్రొగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ టిఎస్ఎస్‌కె. పాత్రో మాట్లాడుతూ రస్తాకుంటుబాయి కేవీకే లక్ష్యాలు, కేవీకేలో ఉన్న డెమో యూనిట్లపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.శ్రీనివాస రాజు, ఎస్.స్రవంతి, జి.అమృతవీణ, ఎం.అనంత విహారి, జి.అను పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రొగ్రాం కో ఆర్డినేటర్ పాత్రో

డ్రాపౌట్లను పాఠశాలలో చేర్పించిన అధికారులు

సీతంపేట: పూతికవలస గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో చదివి మధ్యలో బడి మానేసిన టెన్త్ విద్యార్థినులను అధికారులు బడిలో బుధవారం చేర్పించారు. ఈతమానుగూడకు చెందిన సవరజ్యోతి, సవర తేజాలు గత సంవత్సరం బడి మానేశారు. వీరిని డ్రాపౌట్లుగా గుర్తించిన అధికారులు పాఠశాలలో చేర్పించడానికి చైతన్యం చేశారు. వెంటనే సామరెల్లి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ శ్రీనివాసరావు జాయిన్ చేశారు. కార్యక్రమంలో ఏఎంవో పి.కోటిబాబు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు ప్రవేశం కల్పిస్తున్న డీడీ, ఏఎంవో

బ్యాంకింగ్‌పై అవగాహన అవసరం

గరుగుబిల్లి:

బ్యాంకింగ్ సేవలపై విద్యార్థులకు అవగాహన అవసరమని స్థానిక ఏపీజీవీ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ వీవీఆర్ రెడ్డి అన్నారు. రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా సూచనల మేరకు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఆర్థిక లావాదేవీలపై పలు విషయాలను బుధవారం వివరించారు. హెచ్‌ఎం ఎస్ఎల్.పాత్రుడు, ఉపాధ్యాయులు కె.రవీంద్ర పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

పాలకొండ రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశించిన విధంగా ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును అందిపుచ్చుకుని మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని నగర పంచాయతీ చైర్‌పర్సన్ యందవ రాధా కుమారి అన్నారు. నగర కార్యాలయం సమీపంలో వైకేపీ సంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన డ్వాక్రా బజారును బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సభ్యులు రూపొందించిన ఉత్పత్తులు వినియోగదారులు కొనుగోలు చేసేలా ఉండాలన్నారు. నగర పంచాయతీ మేనేజర్ టి.జయరాం, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



డ్వాక్రా బజార్‌లో వస్తువులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్

టెన్త్ టాపర్లకు అభినందన

సీతంపేట: పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా నగదు పురస్కారం, ప్రశంసాపత్రం అందుకున్న విద్యార్థులను, హెచ్‌ఎంలను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి బుధవారం ప్రశంసించారు. దోనుబాయి ఆశ్రమ పాఠశాలకు చెందిన పాలక గురునాథ్‌కు ఎస్టీ కేటగిరిలో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంక్ రావడంతో సీఎం చేతుల మీదుగా రూ.75 వేలు చెక్కు అందుకున్నారు. సామరెల్లికి చెందిన సవర నందిని తృతీయ స్థానం సాధించి రూ.50వేలు చెక్కు అందుకున్నారు. వీరిని తన కార్యాలయంలో పీవో అభినందించారు. గిరిజన సంక్షేమ శాఖ డీడీ శ్రీనివాసరావు, డిప్యూటీఈవో లిల్లీరాణి, హెచ్‌ఎం కె.సుబ్బారావు, సీఎంవో చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



అభినందిస్తున్న పీవో కల్పనాకుమారి

పీహెచ్‌సీ పరిశీలన

జియ్యమ్మవలస: మండలంలోని రావాడ రామభద్రపురం, జియ్యమ్మవలస పీహెచ్‌సీలను డీఎంహెచ్‌వో బి.జగన్నాధరావు బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఆస్పత్రిలో ల్యాబ్ ఫార్మసీ, లేబర్ రూం, వార్డు ఆస్పత్రి పరిసరాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్య సిబ్బంది, ఏఎన్ఎంల పనితీరు అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందుతున్న సేవలు స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఫ్యామిలీ ఫిజీషియన్, నోడల్ అధికారి ఎం.వినోద్‌కుమార్, డాక్టర్ పి.శ్రావణ్‌కుమార్, డాక్టర్ సాయి ప్రసన్న, హెల్త్ సూపర్‌వైజర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం

పాలకొండ: ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎల్ఐసీ ఉద్యోగులు ఉచిత వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. 120 మంది రోగులకు డాక్టర్ టి.రత్నరాజు పరీక్షలు చేశారు. వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేసారు. కార్యక్రమంలో ఎల్.ఐ.సీ బ్రాంచ్ మేనేజరు, సిబ్బంది పాల్గొన్నారు.